## క్లుప్తంగా

### ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం



కార్యక్రమం ప్రారంభిస్తున్న మూర్తి, శ్రీనివాస్

పెందుర్తి: నిత్యం ధ్యాన సాధన వలన సంపూర్ణ ఆరోగ్యం సంతరించుకుంటుందని బ్రహ్మర్షి పిరమిడ్ ధ్యాన కేంద్ర ప్రతినిధులు పి.ఎస్.ఎన్ మూర్తి, శ్రీనివాస్ అన్నారు. పాపయ్యరాజుపాలెంలోని పిరమిడ్ ధ్యాన కేంద్రంలో పాఠశాలల విద్యార్థులకు అవగాహన కలిగించే ధ్యాన గురువులకు రెండు రోజుల వర్క్‌షాప్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ రోజు నిర్ధిష్ట సమయంలో ప్రతీ ఒక్కరూ ధ్యానం చేయాలని సూచించారు. అనేక అనారోగ్య సమస్యలకు కారణమైన మాంసాహారాన్ని త్యజించాలని కోరారు.

### శంకర్ ఫౌండేషన్‌కు బీఓఐ ఫండస్ కెమెరా విరాళం



ఫండస్ కెమెరాను ప్రారంభిస్తున్న బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ మేనేజర్ నికేష్ కుమార్ సిన్హా

సింహాచలం: జీవీఎంసీ 93వ వార్డు నాయుడుతోటలో ఉన్న శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ. 10 లక్షల విలువ చేసే అత్యాధునిక 'ఫండస్ కెమెరా'ను విరాళంగా అందజేసింది. శనివారం బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ మేనేజర్ నికేష్ కుమార్ సిన్హా ఈ కెమెరాను ప్రారంభించారు. ఈ సందర్భంగా శంకర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ ఆత్మకూరి కృష్ణకుమార్ బ్యాంకు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. శంకర్ ఫౌండేషన్ అందిస్తున్న సేవల పట్ల నికేష్ కుమార్ సిన్హా ప్రశంసలు వ్యక్తం చేశారు. ఫండస్ కెమెరా వల్ల దృష్టి లోపాలను నివారించవచ్చని, కంటి లోపల ఉపరితలం అధిక రిజల్యూషన్ చిత్రాలను సంగ్రహించడానికి ఇది ఉపయోగపడుతుందని ఆస్పత్రి డీజీఎమ్ బంగార్రాజు తెలిపారు. ఈ కెమెరాలో రెటీనా, ఆప్టిక్ డిస్క్, మాక్యులా, పోస్టీరియర్ పోల్ వంటి భాగాలను పరిశీలించవచ్చని ఆయన వివరించారు. కార్యక్రమంలో ఆస్పత్రి జనరల్ మేనేజర్ కె. రాధాకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

### అధ్యాపకులకు సత్కారం



మాట్లాడుతున్న ఏయూ అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్

పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. అధ్యాపకులను ఆంధ్రయూనివర్సిటీ అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ ఆచార్య జేమ్స్ స్టీఫెన్ సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలకు మార్గనిర్దేశనం చేసే గురుతర బాధ్యత గురువులపై ఉందన్నారు. కరస్పాండెంట్ టి.థియోఫిలాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు వై.ప్రవీణ్‌కుమార్, కె.రాజ్‌కుమార్, డాక్టోరల్ ఫెలోస్, వి.పాల్, ప్రిన్సిపాల్స్ ఎస్‌ఈ ఫ్లోరా, ప్రిన్సిపాల్ ఎ.రాజ్‌కుమార్, ఏవో రవి తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే



గ్రాండ్ పేరెంట్స్‌కి పాదాభివందనం చేస్తున్న విద్యార్థులు

పెందుర్తి: సుజాతనగర్ లోని రవీంద్రభారతి పాఠశాలలో గ్రాండ్ పేరెంట్స్ డే శనివారం ఘనంగా నిర్వహించారు. తాతయ్యలు, అమ్మమ్మలు, నాన్నమ్మలకు విద్యార్థులు పాదపూజ చేశారు. అవ్వాతాతలతో మన వళ్ల అనుబంధం గురించి వివరిస్తూ స్కిట్‌లు, డాన్స్‌లతో విద్యార్థులు అలరించారు. డీజీఎం కె.రమ్య, ప్రిన్సిపాల్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

### వెంకన్నకు ప్రత్యేక పూజలు



పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన, బాలబోగం చేశారు. అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం, సర్వ దర్శనాలు జరిగాయి. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

# రోడ్లు అధ్వానం.. ప్రయాణం నరకం



అసకపల్లి-లంకెలపాలెం రోడ్డులోని వాకాడ బంద వద్ద ఏర్పడిన గుంతలో నిలిచిపోయిన వాహనాలు

- అడుగడుగునా గుంతలతో ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు
- ప్రతిపాదనలతో సరిపెడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల



వంగలి సమీపంలో..



భారీ వాహనాలతో రద్దీగా ఉన్న అసకపల్లి-లంకెలపాలెం రోడ్డు



అధ్వానంగా అసకపల్లి-లంకెలపాలెం రహదారి

సబ్బవరం : సబ్బవరం మండలంలోని ప్రధాన రహదారుల దుస్థితిపై స్థానికులు, వాహనదారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే పలు రోడ్లు గుంతలమయంగా మారడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా, రోడ్ల పరిస్థితిలో మార్పు రాలేదని వారు విమర్శిస్తున్నారు.

**ప్రధాన రహదారుల దుస్థితి**

అసకపల్లి-లంకెలపాలెం రహదారిపై భారీ వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. రోడ్డుపై అడుగడుగునా పెద్దపెద్ద గుంతలు ఏర్పడటంతో వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. భారీ వర్షాలకు గతంలో వేసిన ప్యాచ్ వర్క్‌లు కొట్టుకుపోయి పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ. 70 లక్షల నిధులతో ప్యాచ్ వర్క్‌లు చేసినా అవి నాసిరకంగా ఉన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అంతకాపల్లి-రావలమ్మపాలెం రోడ్డు- సబ్బవరం-గుల్లేపల్లి మార్గంలోని ఈ రోడ్డుపై కూడా గుంతలు ఎక్కువయ్యాయి. ద్విచక్ర వాహనదారులు తరచుగా ప్రమాదాల బారిన పడుతున్నారు. గతంలో గ్రామస్తులు గ్రావెల్‌తో గుంతలను పూడ్చినా, వర్షాలకు అవి కొట్టుకుపోయాయి.

**వంగలి రోడ్డు:** మారిటైం విశ్వవిద్యాలయం నుంచి పెట్రో యూనివర్సిటీ మీదుగా వెళ్లే వంగలి రోడ్డు గుంతలమయంగా మారింది. వర్సిటీల నిర్మాణ పనుల కోసం మెటీరియల్ తీసుకెళ్లే వాహనాలు ఈ రోడ్డుపై ప్రయాణించడానికి భయపడుతున్నాయి.

**రహదారి అధ్వానం**



అసకపల్లి-లంకెలపాలెం రోడ్డు అడుగడుగునా పెద్దపెద్ద గుంతలతో అధ్వానంగా తయారైంది. అసకపల్లి సమీపంలోని వాకాడ బంద సమీపంలో రోడ్డుపై ఏర్పడిన పెద్ద గుంతలలో భారీ వాహనాలు నిలిచి పోతున్నాయి. ప్రతిరోజు నాలుగైదు వాహనాలు రోడ్డుకు అడ్డంగా నిలిచిపోతుండటంతో జేసీబీలు, ప్రొక్లెయిన్‌లతో బయటకు తీస్తున్నారు. ఈ రహదారి తక్షణం అభివృద్ధి చేయాలి.

– సుంకర గంగరాజు, అసకపల్లి, సబ్బవరం

**రాకపోకలకు ఇబ్బంది**



ఆరిపాక-వంగలి రోడ్డులోని మారిటైం విశ్వవిద్యాలయం నుంచి పెట్రో యూనివర్సిటీ మీదుగా వంగలి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. ప్రస్తుతం వర్సిటీలకు వెళ్లే వాహనాలతో రద్దీగా ఉండే ఈ రోడ్డుపై రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. రహదారి మెరుగుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– పిల్లల మునలయ్య, రాయపుర అగ్రహారం, సబ్బవరం

**పట్టించుకోని కూటమి ప్రభుత్వం**

అధికారంలోకి రాకముందు రోడ్ల పరిస్థితిపై విమర్శలు చేసిన కూటమి నేతలు, అధికారంలోకి వచ్చాక రోడ్ల అభివృద్ధిని పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంక్రాంతికి రోడ్లను అభివృద్ధి చేస్తామని ఇచ్చిన హామీలు కేవలం అరకొర ప్యాచ్‌వర్క్‌లకు మాత్రమే పరిమితమయ్యాయని, మిగిలిన రోడ్లను ప్రతిపాదనల పేరుతో గాలికి వదిలేశారని వారు అంటున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్లు, చెరువులకు తేడా లేకుండా పోయిందని, స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు హామీలు, ప్రతిపాదనలతోనే సరిపెడుతున్నారని ప్రజలు వాపోతున్నారు. తమ హామీలను అమలు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### విశేషంగా సామూహిక లక్ష్మీగణపతి హోమం



లక్ష్మీగణపతి హోమంలో పాల్గొన్న కాలనీ నివాసితులు

సింహాచలం : 98వవార్డు పరిధి సింహపురికాలనీలో జరుగుతున్న వినాయకచవితి మహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి లక్ష్మీగణపతి హోమాన్ని ఘనంగా నిర్వహించారు. మండపం ప్రాంగణంలో హోమగుండాలను ఏర్పాటు చేశారు. హోమంలో పాల్గొన్న కాలనీ నివాసితులను వరసగా వేంజేంపజేశారు. విఘ్నేశ్వర పూజ, విఘ్నేశ్వర అష్టోత్తరం, మండపారాధన, అగ్ని ప్రతిష్ట, హోమం, లక్ష్మీ సహస్రనామార్చన, పూర్ణాహుతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. హోమ ప్రసాదాన్ని అందజేశారు. కాలనీ అసోసియేషన్, సింహపురి యూత్ ఏర్పాట్లు పర్యవేక్షించింది.

### సింహగిరిపై ముగిసిన పవిత్రోత్సవాలు



అప్పన్నకు తిరువీధి నిర్వహిస్తున్న వేదపండితులు

సింహాచలం : సింహగిరిపై ఐదు రోజులుగా జరుగుతున్న పవిత్రోత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. పవిత్రోత్సవాల్లో భాగంగా ఉదయం ఏకాంత స్నపనం విశేషంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవమూర్తులైన గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ భోగమండపంలోకి వేంజేంపుజేసి పంచామృతాలు, గంగధార జలాలతో అభిషేకం జరిపారు. అనంతరం విశేషంగా హారతులు అందజేశారు. అలాగే సాయంత్రం ఉత్సవమూర్తులకు ఆలయ బేడామండపంలో తిరువీధి నిర్వహించి, ప్రత్యేక హారతులు సమర్పించారు. ఈ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమాలను ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధాన అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, కరి సీతారామాచార్యులు నిర్వహించారు. సూపరింటెండెంట్ సత్యశ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## గణపతి ఉత్సవాల్లో అదీప్‌రాజ్



చిన బంగారమ్మపాలెంలో స్వామివారిని దర్శించుకుంటున్న అన్నంరెడ్డి అదీప్‌రాజ్



అసకపల్లిలో అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తదితరులు

సబ్బవరం: మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రి ఉత్సవ మండపాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పెందుర్తి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ నేతలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అసకపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సిద్ధినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అదీప్‌రాజ్, అనంతరం మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు, ఉత్సవ కమిటీ సభ్యులు నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదేవిధంగా, జీవీఎంసీ 88వ వార్డు పరిధిలోని అజనగిరి కాలనీలో పవర్ బాయ్స్ యూత్ ఏర్పాటు చేసిన మండపంలో స్వామివారిని దర్శించుకున్న తర్వాత, అక్కడ కూడా అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదీప్‌రాజ్ జీవీఎంసీ 88వ వార్డు పరిధిలోని గంగవరం, చిన బంగారమ్మపాలెం గ్రామాల్లోని గణపతి మండపాలను కూడా సందర్శించి పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గండి రవికుమార్, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కోటాన రాము, మాజీ కార్పొరేటర్ చోప్పా నాగరాజు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు, పార్టీ సీనియర్ నాయకులు రాపేటి రాము, వద్దాది అప్పలరాజు, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు బొడ్డేపల్లి హేమంత్ కుమార్, దనిమిరెడ్డి శ్రీనివాసరావు, గోలజాని దుర్గా ప్రసాద్, విరోతి రామారావు, సర్వసిద్ధి బోరయ్య, ఇతర గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ట్యాంకర్ బోల్తా: డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



మండల కాంప్లెక్సు సమీపంలో బోల్తా పడిన ఫ్లైయాష్ ట్యాంకరు



తీవ్రంగా గాయపడిన డ్రైవర్

పరవాడ: పరవాడ-లంకెలపాలెం రహదారిలో శనివారం తెల్లవారుజామున ఈ.బోనంగి ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో ఫ్లైయాష్ ట్యాంకర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్యాంకర్ డ్రైవర్ కమిలేష్ రాయ్ తీవ్రంగా గాయపడ్డాడు. గాజువాక సమీపంలోని ఆటోనగర్ సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి రాంబిల్లి వైపు వెళ్తున్న ఫ్లైయాష్ ట్యాంకర్ శనివారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో లంకెలపాలెం వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బీహార్‌కు చెందిన డ్రైవర్ కమిలేష్ రాయ్ తల, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. హెల్పర్ దినీష్ రామ్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గాయపడిన డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం కేజీహెచ్ తరలించారు. పరవాడ పోలీసులు క్రేన్ సహాయంతో ట్యాంకర్‌ను తొలగించి ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బై బై గణేషా...

- వాడవాడలా ఘనంగా అన్నసమారాధనలు
- సందడిగా గణపతి ఊరేగింపు.. నిమజ్జనోత్సవం



పెందుర్తిలో వడ్డన చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేత శరగడం చిన అప్పలనాయుడు



రాంపురంలో పూజల్లో పాల్గొన్న నారాయణరావు, భక్తులు



పరవాడ సిరపరపు వారి వీధిలో ఏర్పాటు చేసిన వినాయకుడు

పెందుర్తి: జై భోలో గణపతి మహారాజ్ అంటూ నియోజకవర్గ ప్రజలు వినాయకుడికి వీడ్కోలు పలికారు. వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. వాడవాడలా అన్న సమారాధలు జరిగాయి. సాయంత్రం సందడిగా ఊరేగింపులు సాగాయి. భక్తిశ్రద్ధలతో గణపతిని భక్తులు నిమజ్జనం చేశారు. జీవీఎంసీ 96వ వార్డు పెందుర్తి పాతూరు, ఈతపేట, సాలిపేట, దొగ్గవానిపాలెం కాలనీ, జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీల్లోని గణపతి మండపాలను వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మాజీ కార్పొరేటర్ శరగడం చిన అప్పలనాయుడు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం జరిగిన అన్నసమారాధనలు ప్రారంభించారు. జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో వైఎస్సార్ సీపీ నాయకురాలు మీసాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కబడ్డీ, ఖోఖో, మ్యూజికల్ చైర్ పోటీల్లో విజేతలకు శరగడం చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఎర్ర అప్పలరాజు, మురళి, మళ్ల శ్రీను, దొడ్డి నరసింగరావు, కాలనీల పెద్దలు, భక్తులు పాల్గొన్నారు. మండలంలోని కోట్నీవానిపాలెంలో గణపతికి ప్రత్యేక పూజలు జరిగాయి. మధ్యాహ్నం జరిగిన అన్నసమారాధనలో దాదాపు వెయ్యి మంది భక్తులు ప్రసాదం స్వీకరించారు. సాయంత్రం నిమజ్జనోత్సవం ఘనంగా జరిపారు. గొరపల్లి, గంగమ్మపేట, కరకవానిపాలెం, జుత్తాడ, ముదపాక, రాంపురం, పెదగాడి, గవరపాలెం, సరిపల్లి, చినముషిడివాడ, పురుషోత్తపురం, వేపగుంట ప్రాంతాల్లో ఘనంగా నిమజ్జనోత్సవాలు జరిగాయి.

**సందడిగా వేడుకలు**

పరవాడ: మండల కేంద్రమైన పరవాడ గ్రామంలోని సిరపరపు వారి వీధిలో 'క్రేజీ, బ్యాడ్ బాయ్స్' యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మహోత్సవాలు శనివారం భక్తి శ్రద్ధలతో జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, గ్రామ పెద్దలు పైల రామచంద్రరావు, అఖిల నాయుడు, గండి ఈశ్వరరావు, సిరపరపు రాజేష్, చిట్టమ్మలు వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండపం వద్ద భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని సర్పంచ్ అప్పలనాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో చుక్క నమో, మద్రావు ప్రసాద్, యూత్ సభ్యులు కర్రి సంతోష్, దుంగల అప్పలనాయుడు, ఎస్. అక్కునాయుడు, పైల మురళి, కె. అక్కునాయుడు, బందారు అజయ్, గండి దిలీప్, చుక్క త్రినాథ్, పైల అశోక్ పాల్గొన్నారు.

**ఘనంగా చవితి వేడుకలు**

పరవాడ: ముత్యాలమ్మపాలెం శివారులోని సమ్మెంగపాలెం గ్రామంలో ఎస్ఎంపీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వరసిద్ధి వినాయక మహోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. ముత్యాలమ్మపాలెం పంచాయతీ కార్యదర్శి రజిని..వినాయకుడిని దర్శించుకున్నారు. వినాయక మహోత్సవాలను పురస్కరించుకుని మండపం వద్ద భారీ అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వేడుకల నిర్వహణలో యూత్ సభ్యులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



కోట్నీవానిపాలెంలో గణపతి ఊరేగింపు



వరసిద్ధి వినాయకుడిని దర్శించుకున్న భక్తులు



అన్నసమారాధనలో పాల్గొన్న గంట్ల శ్రీనుబాబు

**ఐదు వేల మందికి అన్నసమారాధన**

సింహాచలం: అడవివరంలోని ఆయిల్‌మిల్ వద్ద గణేష్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో వినాయకచవితి ఉత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. ఈసందర్భంగా మధ్యాహ్నం 5 వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. గణేష్ యువజన సంఘం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు ఈకార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాదాన్ని భక్తులకు అందజేశారు.రాత్రి గణపతి నిమజ్జనం కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు.

## ట్రంప్ సుంకాలపై కూటమి వైఖరి స్పష్టం చేయాలి



నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీల ప్రతినిధులు

బీచ్‌రోడ్డు: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆ దేశంలో భారతీయ సరకుల దిగుమతిపై 50 శాతం సుంకాలు విధించడాన్ని వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండిస్తూ, ట్రంప్ సుంకాలను తక్షణం రద్దు చేయాలని, సుంకాలపై మోదీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ తమ వైఖరి వెల్లడించాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. రహిమాన్, సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.మణి తదితరుల ఆధ్వర్యంలో ట్రంప్ సుంకాలను వ్యతిరేకిస్తూ శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రహిమాన్, మణి మాట్లాడుతూ అమెరికా విధించిన సుంకాల వల్ల భారతీయ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. మోదీ, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎం. పైడిరాజు, వామపక్ష పార్టీల నాయకులు ఎం.సుబ్బారావు, ఎం.మన్మథరావు, కె. దేవా, సీఎస్ క్షేత్రపాల్, ఎంఎస్ పట్నాయక్, కె. సత్యనారాయణ, జీవీఎం రెడ్డి, ఎండీ బేగం, కొండమ్మ, కె. వనజాక్షి, వెంకటరావు, ఎ. దేముడమ్మ, వై. రాంబాబు,ఎం శ్రీనివాసరావు పలువురు వామపక్ష పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిమ్ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ శానాపతి వసంత

పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డు నరవవానిపాలెం ప్రభుత్వ మండల పరిషత్ పాఠశాల ఆవరణలో నిర్మించనున్న ఓపెన్ జిమ్ నిర్మాణ పనులకు కార్పొరేటర్ శానాపతి వసంత చేతుల మీదుగా శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.15 లక్షల నిధులతో ఈ జిమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నాయకులు శానాపతి శంకర్రావు, అవగడ్డ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.